## 'RICHARD CORY'

Whenever Rihard Cory went down town,
We people on the pavement looked at him
He was a gentleman from sole to crown
Clean favoured, and imperially slim.
And he was always quietly arrayed,
And he was always human when he talked;
But still he fluttered pulses when he said,
"Good - morning", and he glittered when he walked.
And he was rich - yes, richer than a king -
And admirably schooled in every grace:
In fine, we thought that he was everyting,
To make us wish that we were in his place.
Soon we worked, and waited, for the light,
And went without the meat, and cursed the bread;
And Richard Cokry, one calm summer night
Went home and put a bullet through his head.

***- E.A.ROBINSON 1869 - 1985***

పై పద్యంలో గొప్ప ట్విస్ట్ వుంది. ప్రపంచమంతా Richard Cory ని తల్చుకుని అసంతృప్తితో కుమిలి పోతూ వుంటే, జీవితం పరిపూర్ణం కావడానికి కావలసిన సమస్త సంపదలు, సద్గుణాలు వుండి కూడా, దేనికోసమో అసంతృప్తితో బాధపడుతాడు Richard Cory.

తన అసంతృప్తిని extreme stage కి తీసుకువెళ్లి, ఆత్మహత్య చేస్కుంటాడు. ఈ భావాన్ని తెలుగులో ప్రెజెంట్ చేస్తే ఎలా వుంటుంది అనిపించి ఈ కథని రాయడం జరిగింది. ఇది అనువాదం కాదు. అనుసరణ.

- రచయిత

దివ్య భూషణుడు మా వూరికి చెందిన పూర్వపు జమీందారి వంశంవాడు. అతన్ని మేము ఎన్నడూ చూసి వుండలేదు. ఎక్కడెక్కడో మహా నగరాల్లో గడుపుతుంటాడని ఆ కుటుంబం గురించి తెలిసిన వాళ్లు అక్కడా యిక్కడా చెపుతూ వుండేవాళ్ళు. జమీందార్ల పాత భవంతి మనుష్య సంచారానికి నోచుకోకుండా పడి వుంది చాలా కాలం.

ఎన్నో, ఎన్నో సంవత్సరాల తర్వాత, ఓ రోజు ఓ వార్త పుట్టింది దివ్యభూషణుడు మా వూరు వస్తున్నట్టు. జనంలో గుసగుసలు ఇంకా చెదురుమదురుగా మిగిలిన ఆస్తిపాస్తుల్ని అమ్మేసి, సొమ్ము చేసుకోవడానికి వస్తున్నాడనిన్నీ, ఆస్తులన్నీ హారతి కర్పూరంలా హరించుకుపోయాయి గనకు చివరి దినాలు యీ పల్లెటూళ్లో గుట్టు చప్పుడు కాకుండా గడిపేయాలని వస్తున్నాడన్నీ ... యిలా.

సరిగ్గా కార్తీక పౌర్ణమినాడు, వెన్నెల విందులా కురుస్తున్న సమయంలో, వెన్నెలని తృణీకరించే ధవళ వర్ణంలో, అయిరావతంలా మెరిసి పోతున్న ఓ పెద్ద విదేశీ కారులోంచి దిగి మా వూరి గడ్డ మీద కాలు పెట్టేడు దివ్యభూషణుడు. పొంగులతో, నురగలతో వురకలు వేస్తున్న పాల సముద్రంలాంటి వెన్నెల్లా, ధవళ కాంతులతో ధగ ధగ మెరిసిపోతున్న విదేశీ కారు బొత్తిగా దిగ దుడుపు దినుసుల్లా కనిపంచేయి అతగాడి ముందు. ఎవరో దేవదూత మా ముందునుంచి నడిచివెడుతున్న భావన కలిగింది మా అందరికీ దివ్య భూషణుడ్ని చూడగానే. దాంతో మంత్రించబడ్డ వాళ్లల్లా తదేక ధ్యానంగా అతన్నే చూస్తూ వుండి పోయాం. దివ్యభూషణుడు మా వైపు తిరిగి వెన్నెల నవ్వి నట్టుగా ఓ చిరునవ్వు నవ్వి, వినయమో, గౌరవమో తెలయనివ్వని ఫక్కీలో చేతులు మోడ్చి నమస్కరించేడు. తదుపరి భవంతిలోకి వెళ్లిపోయేడు.

దివ్య భూషణుడు మా వూర్లో అడుగు పెట్టినప్పటినుండి, మా వూరి వాళ్లందరికీ క్రమ క్రమంగా సుఖశాంతులు దూరమవుతూ వచ్చేయి. 'ఇదీ' అని స్పష్టంగా చెప్పడానికి వీల్లేని ఏదో అలజడి, అశాంతి మమ్మల్ని యిబ్బంది పెడుతున్నాయి. అయితే, ఎందుకని మేం యిలా అయిపోయాంవట? దివ్యభూషణుడు చప్పుడు చేయ్యని సంకెళ్ల లాగో, చాప కింద నీరులాగో, చడీ చప్పుడు కాకుండా మాకు యిబ్బందులు కలిగిస్తున్నాడా? అయన మమ్మల్ని దోచుకోవాలని సంకల్పించిన దుర్మార్గుడా? దొంగా? హరి, హరీ! యివేవి కావు. మేం అశాంతితో కుమిలిపోడానికి కారణాలు వేరు.

దివ్య భూషణుడు బజారు వీధిలోంచి వెళుతున్నాడనుకోండి, మేమంతా రోడ్డు కటూ యిటూ నిలబడి కళ్లప్పగించి చూస్తూండే వాళ్లం, మమ్మల్ని మేం మరచిపోయి. ఆయన యెంతో

మర్యాదస్తుడు. మమ్మల్ని చూసి పలకరింపుగా చిరునవ్వు నవ్వేవాడు. "ఆహా! ఏం హుందాఅయిన నవ్వు!" అని మాలో మేమే అనుకునేవాళ్లం మెచ్చుకోలుగా. హుందాతనం ఒక్కటే కాదు దివ్యభూషణుడి ఆభరణం. ఆయన ఎంతో మర్యాదస్తుడూ, నెమ్మదస్తుడూ కూడాను అతన్ని చూసి మెచ్చుకోని వ్యక్తి మా వూర్లో ఒక్కడు కూడా వుండే వాడుకాదు. రాజులా ఠీవిగా, పాదరసంలా చురుగ్గా, జువ్వలా నిటారుగా అతగాడు నడిచిపోతుంటే, క్రమేపి మేమంతా మా బడుగు బతుకుల్ని అతని జీవితంతో సరిపోల్చుకుని సిగ్గుతో కుమిలిపోతూ వుండేవాళ్లం "ఛీ! మనవీ బతుకులేనా!" అనే భావంతో.

మా అశాంతి దిన దిన ప్రవర్ధనమానమవుతూ వుండడానికి యింకా బోలెడు కారణాలు కనిపిస్తూ వచ్చేయి. ముందులో అంత శ్రద్ధగా గమనించకపోయినా, క్రమేపీ మా దృష్టి ఆయన దుస్తుల మీదికి మళ్లింది.దివ్యభూషణుడు ధరించే దుస్తులు ఎప్పుడూ ఒద్దికగా, నిరాడంబరంగా కనిపించేవి. కానీ మాకు తెలిసొచ్చిందేవిటంటే ఆయన ధరించే బట్టలు నిజంగా దివ్యాంబరాలంత ఖరీదైనవట! ఎంతో అరుదైనవట! దాంతో మేం ధరించే దుస్తులు ఆయన దుస్తులు ముందు చింకిపాతల్లా కనిపించి నిత్యం ఒంటి మీద సంచారం చేస్తున్న తేళ్లు, జెర్రులులాగ అనిపించి మమ్మల్ని బాధిస్తూవుండేవి.

అయితే యింతటి అరుదైనా బట్టలు ధరిస్తున్న దివ్యభూషణుడిలో ఎక్కడేనా డాబు, భేషజం లాంటివి తొంగి చూసేవా? ఛత్! అటువంటి ప్రవర్తన సూచన మాత్రంగా కూడా ఎక్కడా కనిపించేది కాదే! అతని ప్రతి పలుకులోనూ మానవత్వం, మార్దవం, ఆదరణ, ఆత్మీయత, ఆర్ద్రత, తొణికిసలాడుతూ వుండేవి. అతను గాని ఎవరినైనా పలుకరిస్తే చాలు, ఆ పలకరించబడిన వ్యక్తి తన జన్మధన్యంమైనట్టుగా భావించి ఆనందోద్వేగాలతో వూగిపోయేవాడు.

అందరి జమీందార్ల మాదిరే దివ్యభూషణుడు కూడా తనకు మిగిలిన ఆస్తి పాస్తుల్ని చిల్లపెంకుల్లా ఖర్చు పెట్టేసి. తన శేష జీవితాన్ని వున్నదాంతో గుట్టుగా గడిపేయాలనే సంకల్పంతో ఈ పల్లెటూరు చేరుకున్నాడని కదూ - మాలో కొందరు మొదట్లో గుసగుసలు పోయాం! ఎంత పొరపాటు! క్రమేపి మాకు తెలిసింది - ఆయన ఎంతో పొదుపరనిన్నీ, ఎంతో ధనవంతుడనిన్నీ, [illegible]న తర్వాత ఆయన తెలివిగా పెట్టిన వ్యాపారాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నాయని. దాని ఫలితంగా దేశంలో వున్న మహా సంపన్నుల్లో దివ్యభూషణుడు కూడా ఒకడట. అయితే, ఆశ్చర్యంవేవిటంటే, యింత సిరిసంపదలు, యిన్ని మంచి గుణాలు అతనిలో వున్నా అతనికి గర్వం ఏ కోశానా లేదు. అహంకారం అన్నది అణువంతయినా లేదు. అతనికి తెలియని మర్యాదా, సత్ప్రవర్తనా ఎక్కడ వెతికినా కనిపించవు.

ఇదిగో, యివేనండి మా అశాంతికి మూలకారణాలు - మేవంతా బతికితే దివ్యభూషణుడిలా బతకాలిగాని, ఎలాటి గుర్తింపు లేని దిక్కుమాలిన బతుకు బతికేం లాభం అనే భావం కొచ్చేం. రోజులు గుడుస్తున్న కొద్దీ మా అశాంతి పెరుగుతోందే కాని తరగడం లేదు. మాలో కొందరయితే, తిండికీ, నిద్రకీ కూడా దూరమయ్యారు యీ అశాంతితో.

అయితే, మా సంగతలా వుంచి, దివ్యభూషణుడి సంగతేవయిందో

తెలుసుకుంటారా కాస్త?

అతడు మా వూరికి వచ్చి సరిగ్గా ఏడాదయింది. అంటే, ఆ వేళ మళ్లీ కార్తీక పౌర్ణమన్న మాట. వెన్నెలేమో వెలుగుల విందుచేస్తోంది. చిన్న చలిగాలి వీస్తోంది నిశ్శబ్దంగా, చూస్తుంటే, కాలం ఆగిపోయిన భ్రాంతి కలుగుతోంది. అలాటి వేళప్పుడు ఎక్కడికో వెళ్లిన దివ్యభూషణుడు తిరిగి వచ్చేడు. పొద్దుపోయినా తన కోసం వేచివున్న కొద్దిపాటి వూరి పెద్దలకు సమ్మోహనాస్త్రం లాంటి చిరునవ్వుతో నమస్కారం మాత్రం చేసి, మారు మాట మాట్లాడకుండా భవంతిలోకి వెళ్లిపోయాడు. నిశ్శబ్దంగా తన గదిలోకి వెళ్లిపోయి, తలుపులు మూసేస్కుని, ఏం చేశాడో తెలుసునా?

పిస్తోలు తీసి, తన కణతలకి గురి పెట్టుకుని, కాల్చేసుకున్నాడు. ఎందుకట? ఎవరికి తరంట సమాధానం చెప్పడం?

☆✪☆